క్లుప్తంగా

గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ప్రాజెక్టు మేనేజర్‌గా శివకుమార్

ఖమ్మం వైద్యవిభాగం: ఉమ్మడి జిల్లా గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ప్రాజెక్టుగా మేనేజర్‌గా పాటి శివకుమార్ నియమితులయ్యారు. ఈ సర్వీసెస్ పరిధిలోకి భాగంగా 108, 102(అత్యవసర సేవలు), 1962(గర్భిణులు)తో పాటు ఉచిత పార్థీవ వాహనాలు వస్తాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా మేనేజర్‌గా ఉన్న భూమా నాగేందర్ హైదరాబాద్ బదిలీ కాగా, వరంగల్‌లో విధులు నిర్వర్తిస్తున్న శివకుమార్‌ను ఆ స్థానంలో నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

తహసీల్దార్ బదిలీ

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం తహసీల్దార్ సుధీర్‌ను సత్తుపల్లి ఎలక్షన్ డీటీగా బదిలీ చేస్తూ శనివారం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో తఫ్జల్‌హుస్సేన్‌ను నియమించారు. సుమారు 20 రోజుల వ్యవధిలోనే సుధీర్ బదిలీ కావడంపై చర్చ సాగుతుంది.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమతరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లేన్ల మరమ్మతుల దృష్ట్యా నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ యాదగిరి, ఏఈ లక్ష్మణ్‌రావు తెలిపారు. మైసమ్మగుడి ఫీడర్ పరిధిలో ఉదయం 7నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వీఆర్‌కే సిల్క్ వెనకవైపు, వరదయ్యనగర్, మమత ఆస్పత్రిరోడ్డు, లకారం ట్యాంక్‌బండ్ వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

గ్రామ సమాఖ్య పాలకవర్గాల ఎన్నిక

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామ సమాఖ్య, సంఘ చైతన్య గ్రామ సమాఖ్యల పాలకవర్గాలను శనివారం ఎన్నుకున్నారు. ఓం సాయి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలిగా బొమ్మ కవిత, ఉపాధ్యక్షురాలిగా గండు మౌనిక, కార్యదర్శిగా బాలేబోయిన దివ్యశ్రీ, ఉప కార్యదర్శిగా బారిన సుజాత ఎన్నిక కాగా చైతన్య గ్రామ సమాఖ్య అధ్యక్షురాలిగా మల్లేబోయిన పుష్ప, ఉపాధ్యక్షురాలిగా కుక్కల మణెమ్మ, కార్యదర్శిగా ఆలేటి శ్రీలక్ష్మి, సహాయ కార్యదర్శిగా పూజల భాగ్యమ్మ, కోశాధికారిగా పొట్టపింజర రజని ఎన్నికయ్యారు. ఐకేపీ సీసీలు వెంకట్రావమ్మ, పెద్దపాక వెంకటేశ్వరరావు, వీఓఏలు మరికంటి శైలజ, బి.నాగలక్ష్మి, గ్రూప్ లీడర్లు పోలంపల్లి సునీత, చల్ల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సంస్థాగత నిర్మాణానికి పాటుపడాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీని సంస్థాగతంగా నిర్మించడానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ ఖమ్మం జిల్లా ప్రభారీ పాపారావు, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావులు పిలుపునిచ్చారు. సంఘటన కార్యశాల ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణం అనే అంశంపై ఖమ్మంలో శనివారం రాత్రి స్టడీ సర్కిల్ జరిగింది. నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, సన్నే ఉదయ్‌ప్రతాప్, రమేష్, పుల్లారావు, నున్నా రవికుమార్, గుత్తా వెంకటేశ్వర్లు, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం దాడి హేయం

కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన శనివారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో అశువులు బాసిన పౌరులకు శ్రద్ధాంజలి ఘటించారు. భారత్‌లో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన ఉగ్రవాదులను, ప్రోత్సాహించే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం మామిళ్లగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీ గాయత్రి నగర్ వెల్ఫేర్ సొసైటీ బాధ్యులు



ఖమ్మం వన్‌టౌన్: కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల బాధ్యులు



ఖమ్మంగాంధీచౌక్: ర్యాలీలో వికాస వేదిక సాహిత్య సంస్థ బాధ్యులు



ఖమ్మం స్పోర్ట్స్: మున్నేరు వద్ద స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



నేలకొండపల్లి: యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

తలసేమియా రహిత సమాజ స్థాపనకు కృషి

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియా రహిత సమాజం నెలకొల్పేందుకు అంతా కలిసికట్టుగా కృషి చేయాలని ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఎస్‌బీ సీఐలు రాజిరెడ్డి, హనోక్ పిలుపునిచ్చారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన శనివారం ఖమ్మం రితన్య ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన శిబిరంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ, సీఐలు మాట్లాడుతూ సంకల్ప సంస్థ ద్వారా తలసేమియాపై ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. తమ శాఖ ద్వారా కూడా రక్తదానం చేస్తామని తెలిపారు. వైద్యులు డి.నారాయణమూర్తి, సంస్థ బాధ్యులు పి.రవిచంద్ర, పి.పావని, పి.అనిత పాల్గొన్నారు.



చిన్నారులకు మందులు అందిస్తున్న సంస్థ బాధ్యులు

మావోలతో చర్చలు జరపాలి

ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను పాటించి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ సందర్భంగా శనివారం ఖమ్మం ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ నుంచి పాత బస్టాండ్ వరకు శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో నాయకులు మాట్లాడుతూ.. శాంతిచర్చలకు తాము సిద్ధమేనని మావోయిస్టులు ప్రకటించినా ప్రభుత్వం నుంచి సానుకూలమైన స్పందన రాకపోవడానికి కార్పొరేట్ శక్తులు, బహుళ జాతి కంపెనీలే కారణమని ఆరోపించారు. పార్టీలు, సంఘాల నాయకులు రవిమారుత్, నున్నా నాగేశ్వరరావు, విక్రమ్, ఎర్ర శ్రీనివాస్, సింగు నరసింహారావు, పోటు కళావతి, శివరామకృష్ణ, ఆవునూరి మధు, లక్ష్మీనారాయణ, గోపగాని శంకర్రావు, సర్దార్, స్వర్ణ సుబ్బారావు, నాగరాజు, దేవిరెడ్డి విజయ్, చిర్ర రవి, కె.వెంకటేశ్వర్లు, బాబూరావు, తాళ్లూరి వేణు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ సందర్శన

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపల్ పరిధిలోని గల టీఎన్జీవోస్ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీని టీజీజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. టీజీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావుతో పాటు దుర్గాప్రసాద్, కరుణ్‌సింగ్, రుక్మారావు, జైసాల్, పెద్దినేని రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఎస్‌బీఐటీ' వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ కృష్ణ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, కరస్పాండెంట్ జి.ధాత్రితో కలిసి జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ అప్పారావు ప్రారంభించారు. అనంతరం అప్పారావు, కళాశాల యాజమాన్యం మాట్లాడగా.. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు రికవరీ చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: నకిలీ బిల్లులతోసీఎంఆర్‌ఎఫ్ నిధులు దుర్వినియోగం చేసిన 10 ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకుని నగదు రికవరీ చేయాలని కో రుతూ మాల వారియర్స్ మాల మహానాడు నాయకులు శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ముడుసు జాకబ్ ప్రతాప్ మాట్లాడగా.. జిల్లా అధ్యక్షుడు కొర్లపాటి చిరంజీవితోపాటు పేరం మల్లయ్య, పాగ యోనా, తలారి రాధాకృష్ణ, దోతుల వెంకన్న, పోతురాజు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా నుంచి కాపాడండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో భూకబ్జాలపై విచారణ జరిపి హైడ్రా తరహా చర్యలు చేపట్టాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ఖమ్మంలో శనివారం స్వర్ణ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లా సమావేశంలోఆయన మాట్లాడారు. లకారం చెరువు, గోళ్లపాడు చానల్ భూములను కబ్జా గురైనట్లు తెలిపారు. తొలుత పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. వివిధ జిల్లాల నాయకులు శిర్రా కిరణ్‌కుమార్, గోళ్ల రామకృష్ణ, పసుమర్తి శ్రీనివాస్, గుత్తా నాగేశ్వరరావు, స్వర్ణ సుబ్బారావు, రాకేష్‌రెడ్డి, అజీమ్ బేగ్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూలధనాన్ని ఇచ్చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: గొర్రెల సొసైటీల మూలధనం రూ.కోటిని గొర్రెల సొసైటీలకు అప్పగించాలని కోరుతూ తెలంగాణ యాదవ మహాసభ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి గుమ్మా రోశయ్య మాట్లాడగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భారీ మల్సూర్‌యాదవ్, జిల్లా కన్వీనర్ కోడి లింగయ్య యాదవ్ పాల్గొన్నారు.

పశువైద్యులు.. మూగజీవుల ప్రాణదాతలు

ఖమ్మంవ్యవసాయం: పశు పాలకులకు మార్గదర్శకులుగా, మూగ జీవాల పాలిట ప్రాణదాతలుగా పశువైద్యులు కీలకపాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కొనియాడారు. ఖమ్మం డీపీఆర్సీ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రపంచ పశువైద్య దినోత్సవంలో కలెక్టర్ రక్తదానం చేశాక మాట్లాడారు. గ్రామీణ ప్రజల ముఖ్య జీవనాధారం వ్యవసాయమని, ఇందులో పశుపోషణ కూడా ఇమిడి ఉంటుందని తెలిపారు. ఆహార భద్రతను నిర్ధారించడం, జూనోటిక్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరోధించడంలో కీలకంగా వ్యవహరించే పశువైద్యులు అభినందనీయులన్నారు. అనంతరం జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ జిల్లాలో పశుసంవర్ధక శాఖ పరిస్థితి, చేపడుతున్న కార్యక్రమాలను వివరించగా.. పశువైద్యులు ప్రతిజ్ఞ చేశారు. తొలుత పహల్గాం దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ పురంధర్, పశువైద్య శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీరమణి, పశువైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌బాబుతో పాటు అధికారులు, వైద్యులు శ్రీనివాసశెట్టి, కిశోర్, ప్రదీప్, ఉపేందర్, రాజా తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పశువైద్యాధికారులు

ప్రజా ఆరోగ్య రక్షణ.. వైద్యుల బాధ్యత

ఖమ్మంఅర్బన్: వైద్య విద్య పూర్తిచేసి పట్టాలు అందుకున్న యువత ప్రజా ఆరోగ్య పరిరక్షణను బాధ్యతగా భావిస్తూ తమ వంతుగా సమాజ సేవ చేయాలని కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డి సూచించారు. ఖమ్మం మమత మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో శనివారం జరిగిన వైద్య, దంత, నర్సింగ్ కళాశాలల గ్రాడ్యుయేషన్‌డేలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనగా.. 360 మంది వైద్య విద్యార్థులు, 190 మంది దంత వైద్యవిద్యార్థులు, 100 మంది నర్సింగ్ విద్యార్థులకు పట్టాలు అందజేశాక మాట్లాడారు. వైద్యవిద్యను అందించడంలో మమత సంస్థలు నాణ్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. వైద్యవిద్యలో ఎప్పటికప్పుడు వచ్చే కొత్త అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. మమత విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ పువ్వాడ జయశ్రీ, డైరెక్టర్లు పువ్వాడ నయన్‌రాజ్, నరేన్‌రాజ్, ప్రిన్సిపాళ్లు అనురాధ, వెంకటేశ్వరరావు, కృష్ణ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు. పువ్వాడ ఉదయ్‌మార్ – జయశ్రీ దంపతుల కుమారుడు, డైరెక్టర్లలో ఒకరైన నరేన్‌రాజ్ కూడా ఇదే వేదికగా వైద్యపట్టా అందుకున్నారు.



పట్టా అందిస్తున్న వీసీ నందకుమార్‌రెడ్డి, పక్కన పువ్వాడ అజయ్, జయశ్రీ

రజతోత్సవ సభకు వేలాదిగా తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఖమ్మం నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మంలో శనివారం ఆయన కార్పొరేటర్లు, డివిజన్, గ్రామాల ఇన్‌చార్జ్‌తో సమావేశమై మాట్లాడారు. ఆదివారం ఉదయం 9గంటలకు అన్ని డివిజన్లు, గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించి ఎల్కతుర్తి బయలుదేరాలని తెలిపారు. అనంతరం ఆటో యూనియన్ బాధ్యుడు సత్తార్ మియా ఆధ్వర్యాన 50 కుటుంబాలు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరాయి. బీఆర్‌ఎస్ నగర, రఘునాథపాలెం మండల అధ్యక్షులు పగడాల నాగరాజు, వీరునాయక్‌తో పాటు కూరాకుల నాగభూషణం, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కర్నాటి కృష్ణ, మక్బూల్, బచ్చు విజయ్ కుమార్, పల్లా రాజశేఖర్, మద్దినేని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాలేరు నియోజకవర్గం నుంచి 15 వేల మంది..

నేలకొండపల్లి: బీఆర్‌ఎస్ రజతోత్సవం సభకు పాలేరు నియోజకవర్గం 15 వేల మంది హాజరు కానున్నారని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వున్నం బ్రహ్మయ్య, వెన్నబోయిన శ్రీనివాస్, నాయకులు అనగాని నర్సింహారావు, కోటి శ్రీనివాసరావు, నంబూరి సత్యనారాయణ, షేక్ హుస్సేన్, కాసాని నాగేశ్వరరావు, మాదాసు ఆదాం, ఎస్.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ..

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని, రాజారం గ్రామంలో పార్టీ జెండాను ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు.

కామేపల్లి: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను యువత వేలాదిగా తరలిరావాలని శనివారం కామేపల్లిలో జరిగిన సమావేశంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు పుచ్చకాయల ఉదయ్‌కిరణ్ పిలుపునిచ్చారు.

సంక్షిప్తంగా..

● ఆన్‌లైన్, లోన్ యాప్ మోసాలపై ప్రత్యేక నిఘా

ఖమ్మంక్రైం: సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న ఆన్‌లైన్, లోన్ యాప్ మోసాలపై ప్రత్యేక నిఘా వేసి ప్రజలెవరూ నష్టపోకుండా చూడాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. ఖమ్మంలో ఆయన శనివారం సెక్టార్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు. మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు, సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. సీసీఆర్బీ ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ స్వామి తదితరులు పాల్గొన్నారు.

● వేసవి కార్యాచరణపై సమీక్ష

ఖమ్మంవ్యవసాయం: వేసవిలో అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయాన త్వరగా సరఫరా పునరుద్ధరించేలా ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి సూచించారు. ఆయా అంశాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. డీఈలు నంబూరి రామారావు, నాగేశ్వరరావు, రాములు, చిన్న బాబూరావు, భద్రుపవార్, ఎస్ఏఓ శ్రీధర్, ఏడీఈలు పాల్గొన్నారు.

● గోశాలకు ఉచితంగా మందులు..

ఖమ్మంఅర్బన్: ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం టేకులపల్లి శ్రీవెంకటేశ్వర గోశాలకు మెడికల్ యానిమల్ హెల్త్ కేర్ సంస్థ ఆధ్వర్యాన పశువైద్య మందులు ఉచితంగా అందించారు. గోశాల నిర్వాహకుడు, ప్రధాన అర్చకుడు ఆరుట్ల శ్రీనివాసచార్యులు, పశువైద్యులు పాల్గొన్నారు.

● బోర్డు కార్యదర్శిని కలిసిన 'టిగ్లా' నాయకులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రభుత్వ లెక్చరర్ల అసోసియేషన్(టిగ్లా) నాయకుడు, ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య, రీజినల్ జాయింట్ డైరెక్టర్ జయప్రదను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం బాధ్యులు నయీంపాషా, సుధారాణి, మోదుగు వెంకట్, ఉమాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● జీఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు

ఖమ్మంగాంధీచౌక్: వస్తు సేవా పన్ను (జీఎస్టీ), ఆదాయ పన్ను చట్టాలపై ఏఐఎఫ్‌టీపీ, కేజీపీఏ సంయుక్త ఆధ్వర్యాన టాక్స్ ప్రొఫెషనల్స్, ప్రాక్టీషనర్లకు అవగాహన కల్పించేలా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఖమ్మంలోని వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌లో వారం రోజులుగా వర్క్‌షాప్ కొనసాగుతోంది. ముగింపు సమావేశానికి కేజీపీఏ జిల్లా అధ్యక్షుడు ఉల్లిబోయిన సైదులు అధ్యక్షత వహించగా, ఏఐఎఫ్‌టీపీ వైస్ ప్రసిడెంట్(సౌత్‌జోన్) ఎంవీజే కుమార్, రాష్ట్ర వైస్ ప్రసిడెంట్లు నరేశ్ రంగీ, ఈ.నాగేంద్రప్రసాద్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు కోటా సునీల్, సీహెచ్.కోటేశ్వరరావు, బి.దుర్గాప్రసాద్, జి.రమేష్, కె.రామకృష్ణ, పవన్‌కుమార్, సీహెచ్.సాయిసుధ, మోహన్, సుధీర్, వి.శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, ఎన్.రామకృష్ణ, శిరీశ్, కొమ్మురాజు తదితరులు పాల్గొన్నారు.

● ఒక్కరోజే 403 దరఖాస్తులు..

నేలకొండపల్లి: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. శనివారం పైనంపల్లిలో జరిగిన సదస్సులో 200, మోటాపురంలో 103, శంకరగిరితండాలో 100 దరఖాస్తులు అందాయి. ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, తహసీల్దార్లు వి.వెంకటేశ్వర్లు, తఫ్జల్ హుస్సేన్, డీటీ ఇమ్రాన్, ఎంఆర్‌ఐలు ఆలస్యం మధుసూదన్‌రావు, అల్లం రవి, సొసైటీల చైర్మన్లు నాగుబండి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు పాల్గొన్నారు.

● లబ్ధిదారుల ఎంపికపై సర్వే

కామేపల్లి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఆయా జీపీ పరిధిలో ప్రత్యేకాధికారుల సమక్షంలో సమగ్ర విచారణ చేపట్టి లబ్దిదారులను గుర్తిస్తున్నారు. ఈనేపథ్యాన శనివారం తాళ్లగూడెంలో జీపీ ప్రత్యేకాధికారి, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి సర్వే నిర్వహించి లబ్దిదారులను గుర్తించారు.

● ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం విద్యారంగానికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేయడం ద్వారా గత ప్రభుత్వం మాదిరిగానే పేదలకు విద్యను దూరం చేస్తోందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడారు. నాయకులు ఇటికాల రామకృష్ణ, ఎండీ అన్వర్, మాగం లోకేశ్, లక్ష్మణ్, నాగుల్‌మీరా, మధు, శివనాయక్, మనోజ్, గోపి, ప్రతాప్, రాకేశ్, గణేశ్, ఉస్మాన్ పాల్గొన్నారు.

● కార్పొరేట్ హెయిర్ సెలూన్లను అడ్డుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కులవృత్తిగా నమ్ముకున్న నాయీబ్రాహ్మణులు కార్పొరేట్ హెయిర్ సెలూన్లతో ఉపాధి కోల్పోతున్నందున వాటికి అడ్డుకట్ట వేయాలని నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు యలమందల జగదీష్ కోరారు. శనివారం పలు కార్పొరేట్ హెయిర్ సెలూన్ల ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

● పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఖమ్మంరూరల్: పేదల పార్టీ కాంగ్రెస్ అని, అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ పి.అనిల్ కుమార్ అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి పెదతండాలో శనివారం రాత్రి నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. అందరినీ సమానంగా చూడాలనే ఉద్దేశంతో సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. తొలుత పహల్గాం మృతులకు నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మల్లారెడ్డి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● న్యాయవాదుల సహకారంతో కేసుల పరిష్కారం



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా జడ్జి

ఖమ్మంలీగల్: న్యాయవాదుల సహకారంతోనే న్యాయమూర్తులు కేసులు త్వరగా పరిష్కరించగలరని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తి శాంతిలత సన్మాన సభ బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించగా జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా మాట్లాడారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు మాట్లాడగా శాంతిలతను సన్మానించి, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్‌కు స్వాగతం పలికారు. న్యాయాధికారులు కె.ఉమాదేవి, శీనయ్య, అర్చనకుమారి, అపర్ణ, ఎం.కల్పన, కాసరగడ్డ దీప, బిందుప్రియ, శివరంజని, మాధవి, బి.రజని, నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ బాధ్యులు గద్దల దిలీప్‌కుమార్, విజయశాంత, లక్ష్మి, నవీన్ పాల్గొన్నారు.

● మృతుడి ఆచూకీ లభ్యం..

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెం శివారులో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, ఆయన ఆచూకీ గుర్తించారు. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన గంగు సోమేశ్వరరావు(28) కోదాడకు వెళ్లే క్రమాన ప్రమాదంలో మృత్యువాత పడ్డాడని పోలీసులు తెలిపారు.

● వేలాడుతున్న తీగలు తాకడంతో ప్రమాదం

నేలకొండపల్లి: రహదారికి ఓ పక్క నుంచి ఇంకోపక్క పొలాలకు విద్యుత్ సరఫరా కోసం రైతులు అమర్చిన తీగలు తాకడంతో ముగ్గురికి గాయాలు కాగా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మంగాపురంతండా – రాయగూడెం మధ్య పలువురు రైతులు సాగు అవసరాలకు విద్యుత్ తీగలు వేశారు. ఇవి కిందకు వేలాడకుండా కట్టెలు ఏర్పాటు చేయగా, ఇటీవల గాలిదుమారానికి కట్టెలు విరిగిపోయాయి. దీంతో వేలాడుతున్న తీగలు తాకగా ధీరావత్ రాధాకృష్ణమూర్తి, భూక్యా వెంకట్, బ్రహ్మం తీవ్రగాయాలతో బయటపడ్డారు.

● పెళ్లిరోజే గుండెపోటుతో వ్యక్తి మృతి

కామేపల్లి: భార్య, కుటుంబీకులతో కలిసి ఆనందంగా వివాహ వార్షికోత్సవం జరుపుకోవాల్సిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలోని ముచ్చర్లలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ పాషా (30) ఆటో ట్రాలీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్నం 2 గంటలకు కూలీలను మిరప తోట దగ్గర నుంచి ఇంటికి తీసుకువచ్చాడు. ఆ తర్వాత గుండెలో నొప్పి రావడంతో స్థానిక వైద్యుడిని సంప్రదించగా, ఆయన సూచనతో ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గ మధ్యలోనే పాషా మృతి చెందాడు. పాషా – హసీనా దంపతుల పెళ్లిరోజైన శనివారమే ఆయన మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

● యువకుడు ఆత్మహత్య

ఖమ్మం అర్బన్: ఖమ్మం మధురానగర్‌లో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మధురానగర్ రోడ్డు నంబర్-10లో నివాసముంటున్న అన్నవరపు తరుణ్(24) ఓ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఆయన తల్లి నాగమణి చిన్న కూతురు ఇంటికి వెళ్లగా, శుక్రవారం సాయంత్రం తరుణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం రాజశేఖర్ అనే వ్యక్తి వచ్చాక ఈ విషయం బయటపడింది.

● రూ.26.50 లక్షలు స్వాహా..

ఖమ్మంక్రైం: ఫోన్ నుంచి తప్పుడు మెసేజ్‌లు వెళ్తున్నాయని బెదిరించిన సైబర్ నేరస్తులు ఓ రిటైర్డ్ టీచర్ ఖాతా నుంచి రూ.26.50 లక్షలు స్వాహా చేశారు. ఖమ్మం వేణుగోపాల్‌నగర్‌కు చెందిన ఓ విశ్రాంత ఉపాధ్యాయురాలికి కొందరు సైబర్ నేరగాళ్లు ఇటీవల వీడియో కాల్ చేశారు. ఆమె నంబర్ ద్వారా అసభ్య మెసేజ్‌లు వెళ్తుండడంతో కేసు నమోదు చేశామని నకిలీ ఎఫ్‌ఐఆర్ చూపించారు. అంతేకాక అరెస్ట్ చేయడానికి వస్తున్నామని పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న వారు బెదిరిస్తూ ఈనెల 4 నుంచి 16వ తేదీ మధ్య రూ.26.50 లక్షలను బదిలీ చేయించుకున్నారు. మోసపోయినట్లు గ్రహించిన ఆమె సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు.